ప్రతి రైతుకూ రూ.20 వేలు ఇవ్వాలి



ప్రభుత్వం ప్రకటించిన విధంగా ప్రతి రైతుకూ రూ.20 వేలు ఇవ్వాలి. విడతల వారీగా కాకుండా ఒకేసారి నగదు అందిస్తే రైతులకు పెట్టుబడి సాయం దక్కుతుంది. కేంద్ర ప్రభుత్వం అందించే సహాయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వమే రూ.20 వేలు అందించాలి. వ్యవసాయ రంగానికి ప్రోత్సాహం అందించాలి.

– గొల్ల నాగరాజు, రైతు, కె.పి.దొడ్డి

ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి ఇవ్వాలి



నేను ఎంఎస్సీ పూర్తి చేశా. ఉద్యోగం లేక టీ కొట్టు నడుపుకుంటున్నా. కూటమి అధికారంలోకి రాగానే నిరుద్యోగులకు ఉద్యోగావకాశం,లేదా నిరుద్యోగ భృతి అమలు చేస్తామని మేనిఫెస్టోలో చెప్పారు. ఇప్పటికీ దానిపై ఎవరూ మాట్లాడలేదు.

– నరేష్, నిరుద్యోగి, నిజవళ్లి

తల్లికి వందనం ఎప్పుడిస్తారో?



నాకు ఇద్దరు పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. తల్లికి వందనం పథకం ఒక్కో విద్యార్థికి రూ.15 చొప్పున రూ.30 వేలు వస్తే చదువులు, పిల్లల అవసరాలు తీర్చవచ్చని ఎంతో ఆశపడ్డా. కానీ ఇంత వరకూ ప్రభుత్వం తల్లివందనం పథకం అమలు **చేయలేదు. ఈ ఏడాది** అమలు చేయడం లేదని చెబుతున్నారు. ఇలా అయితే మాలాంటి పేదలకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతాయి.

– షకీలా, 17వ వార్డు, రాయదుర్గం

భృతిపై స్పష్టత లేదు



డిగ్రీలు పూర్తి చేసి ఉద్యోగాల కోసం అన్వేషిస్తున్నాం. పోటీ పరీక్షలకు చదువుకోవడానికి కోచింగ్‌లకు డబ్బులు పెట్టే పరిస్థితి లేక అవస్థలు పడుతున్నాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉద్యోగం లేని నిరుద్యోగులకు రూ.3వేలు భృతి ఇస్తామన్నారు ఇప్పటికీ స్పష్టతలేదు.

– సుమబిందు, బీఎస్సీ, విడపనకల్లు

రూ.1,500 విషయం మర్చిపోయారా?



కూటమి నేతలు ఎన్నికల ప్రచారంలో ప్రభుత్వం ఏర్పాటైతే 18 ఏళ్లు నిండిన మహిళలందరికీ నెలకు రూ.1,500 ఇస్తామని చెప్పారు. ఇంట్లో ఐదుగురు ఉన్నందున ప్రతినెలా రూ.7,500 వర్తిస్తుందని ఆశ పడ్డాం. ఇప్పటి వరకూ దీనిపై స్పష్టతలేదు.

– ఫిరోజ్‌బాను, వజ్రకరూరు



ఆదిలోనే ఆరు గ్యారెంటీలు డకౌట్

అధికారంలోకి రాగానే సూపర్‌సిక్స్ హామీలన్నీ పక్కాగా అమలు చేస్తాం.. ఏటా 'అన్నదాతా సుఖీభవ' కింద పెట్టుబడి సాయం రూ.20 వేలు అందిస్తాం.. ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అందరికీ 'తల్లికి వందనం' ద్వారా ఏటా రూ.15 వేలు ఇస్తాం.. నిరుద్యోగులందరికీ ప్రతి నెలా రూ.3 వేలు భృతి, ప్రతి మహిళకూ రూ.1,500 ఖాతాలో జమ చేస్తాం.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తాం.. ఇలా మేనిఫెస్టో చూపించి, ఎన్నికల ప్రచారంలో ఊరూరా కూటమి నేతలు ఊదరగొట్టారు. అధికారంలోకొచ్చిన తర్వాత హామీలన్నీ గాలికొదిలేశారు. పెట్టుబడి సాయం అందక రైతులు, భృతి అందక నిరుద్యోగులు, తల్లికి వందనం నగదు అందక తల్లిదండ్రులు తల్లడిల్లుతున్నారు. ఉచిత బస్సు ప్రయాణం కోసం రాయదుర్గం, ఉరవకొండ, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో 3,96,061 మంది, అలాగే ఏడాదికి మూడు సిలిండర్ల కోసం 1,36,952 మంది మహిళలు ఎదురుచూస్తున్నారు. గత పాలనలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారు. ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేశారు. ప్రస్తుత పాలనలో కూటమి ప్రభుత్వం కూడా సూపర్‌సిక్స్ హామీలన్నీ అమలు చేయాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

– రాయదుర్గం/ఉరవకొండ/ కళ్యాణదుర్గం:



నియోజకవర్గాల వారీగా అర్హులు

కళ్యాణదుర్గం	1,13,769
రాయదుర్గం	1, 33,516
ఉరవకొండ	95,730
ఇవ్వాల్సిన సాయం	రూ.51.45 కోట్లు

బాబు చేసిన బాసలు..ఊసేలేదు

- ష్యూరిటీ సరే.. భవిష్యత్‌కు గ్యారెంటీ ఏదీ?
- సూపర్ సిక్స్ హామీల అమలు కోసం ప్రజల ఎదురుచూపు
- ప్రభుత్వం ఏర్పాటై నెలలు గడుస్తున్నా ఊసెత్తని వైనం
- ఎప్పడిస్తారో చెప్పాలంటూ ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్న జనం


జగన్ ఐదేళ్ల పాలనలో రైతు భరోసా పథకం కింద రైతులకు అందిన సాయం



నియోజకవర్గం	లబ్ధి (రూ.కోట్లలో)
కళ్యాణదుర్గం	347.41
రాయదుర్గం	283.15
ఉరవకొండ	327.08

జగన్ ఐదేళ్ల పాలనలో అమ్మ ఒడి పథకం కింద మహిళలకు అందిన సాయం

నియోజకవర్గం	లబ్ధి (రూ.కోట్లలో)
కళ్యాణదుర్గం	167.85
రాయదుర్గం	207.24
ఉరవకొండ	154.74



నియోజకవర్గాల వారీగా అర్హులు

కళ్యాణదుర్గం	48,340
రాయదుర్గం	76,746
ఉరవకొండ	52,258
ఇవ్వాల్సిన సాయం	రూ.53.20 కోట్లు



ఉరవకొండ వద్ద బాబుష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కిట్లు విడుదల చేస్తున్న టీడీపీ నేత లోకేష్,పయ్యావుల




రాయదుర్గంలో ఎన్నికల సమయంలో ఏర్పాటు చేసిన టీడీపీ అమలు చేయనున్న పథకాల పోస్టర్



కళ్యాణదుర్గంలో ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాలను తెలియజేస్తూ అమిలినేని సురేంద్రబాబు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

టీడీపీ పాలనలో ఏటా రైతులకు అందాల్సిన సాయం



నియోజకవర్గం	అర్హుల సంఖ్య
కళ్యాణదుర్గం	54,944
రాయదుర్గం	45,789
ఉరవకొండ	53,258
ఏడాదికి ఇవ్వాల్సిన సాయం	రూ. 307.98 కోట్లు

జగనన్న అయ్యింటే 'అమ్మఒడి' వచ్చేది



నాకు ఇద్దరు పిల్లలు. కూతురు రెండో తరగతి, కొడుకు ఆరో తరగతి ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నారు. తల్లికి వందనం కింద ఇద్దరికీ రూ.30 వేలు వస్తుందని ఆశ పెట్టుకున్నాం. జగనన్న సీఎం అయ్యి ఉంటే ఈ పాటికే అమ్మ ఒడి పథకాన్ని అమలు చేసి ఉండేవారు. కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదు.

– మీనాక్షి, సొల్లాపురం

నిరుద్యోగులతో చెలగాటం తగదు



టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిరుద్యోగ భృతి ఇస్తామని చంద్రబాబు ఎన్నికల్లో ప్రకటించారు. అధికారంలోకి వచ్చి రెండు నెలలు కావస్తున్నా ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి గురించి పట్టించుకోలేదు. రూ.20 లక్షల ఉద్యోగాల కల్పన ఊసే ఎత్తడం లేదు. ఎప్పటి నుంచి అమలు చేస్తారో స్పష్టంగా తెలపాలి.

– బంగి శివ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు, రాయదుర్గం



టీడీపీ పాలనలో ఏటా తల్లికి అందాల్సిన సాయం

నియోజకవర్గాల వారీగా అర్హులు

కళ్యాణదుర్గం	27,570
రాయదుర్గం	34,396
ఉరవకొండ	25,572
ఇవ్వాల్సిన సాయం	రూ.131.30 కోట్లు

ప్రతి నెలా రూ.1,500 ఇవ్వాలి



కూటమినేతలు ప్రచారంలో ప్రతి మహిళకూ నెలకు రూ.1,500 ఇస్తామని హామీ ఇచ్చారు. మహిళలు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నాం. ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత హామీని నిలబెట్టుకుంటుందని ఆశతో ఉన్నాం. హామీ అమలు చేయకపోతే మహిళలు ఉద్యమిస్తారు.

– భూమా కమలమ్మ,వెంకటాంపల్లి గ్రామం, వజ్రకరూరు మండలం

క్లుప్తంగా

అధినేత జగన్‌ను కలిసిన ఎల్‌ఎం



మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన ఎల్‌ఎం మోహన్‌రెడ్డి

కళ్యాణదుర్గం రూరల్: విజయవాడలోని వైఎస్సార్‌సీపీ క్యాంపు కార్యాలయంలో మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మాజీ గ్రంథాలయం సంస్థ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నేత ఎల్‌ఎం మోహన్‌రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

కిరాణాషాపులో చోరీ

రాయదుర్గంటౌన్: మండలంలోని ఆవులదట్ల వద్ద తిప్పేస్వామి కిరాణా దుకాణంలో బుధవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. రూ.4,500 నగదు, రూ.12 వేలు విలువైన సరుకులు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపాడు.

కేబుల్ అపహరణ

గుమ్మఘట్ట: మండలంలోని కేపీదొడ్డి సమీపంలో గ్రామ పంచాయతీ తాగునీటి పథకం విద్యుత్ మోటారు కేబుల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. నెలరోజుల వ్యవధిలోనే రెండు సార్లు తాగునీటి పథకం కేబుల్ ఎత్తుకెళ్లారు.

కుక్కదాడిలో ముగ్గురికి గాయాలు



కుక్కదాడిలో తీవ్రంగా గాయపడిన అర్బాస్

రాయదుర్గంటౌన్: పట్టణంలోని 17వ వార్డు గుగ్గిరొట్టి కాలనీలో బుధ వారం కుక్క దాడి చేయగా ముగ్గురికి గాయాలయ్యాయి. గాయపడిన చిన్నారి మహమ్మద్ అర్బాస్, గోవిందరాజులు, మంజునాథను రాయదుర్గం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు.

జగనన్న లేఔట్ పేరు మార్చే యోచన దుర్మార్గం

- వైఎస్సార్‌సీపీ ఉరవకొండ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ: నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో నిర్మించిన జగనన్న లేవుట్ కాలనీల పేరు మార్చి మంత్రి పయ్యావుల కేశవ్ పెట్టాలని యోచించడం దుర్మార్గమైన చర్య అని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి మండిపడ్డారు. బుధవారం అనంతపురంలోని మాజీ ఎమ్మెల్యే స్వగృహంలో పార్టీ పట్టణ ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులతో విశ్వేశ్వరరెడ్డి సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ హయాంలో నియోజకవర్గంలోని పేదలకు ఇంటి స్థలాలు కేటాయించడానికి 100 ఎకరాల భూసేకరణ చేశారన్నారు. ఈభూమిని వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే జగనన్న కాలనీ లేవుట్లు ఏర్పాటు చేసి, అర్హులకు ఇంటి పట్టాలు, ఇళ్ల స్థలాలు నిర్మించామన్నారు. జగనన్న కాలనీల్లో తాగునీరు, విద్యుత్, డ్రెయినేజీ, రోడ్లు తదితర మౌలిక వసతులు కల్పించామన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రత్యేకంగా ఒప్పించి అప్పట్లో జిల్లాలోనే ఎక్కడా లేని విధంగా వేలాది పక్కా ఇళ్లు మంజూరు చేయించిన ఘనత తనదేనన్నారు. రూ.కోట్లు వెచ్చించి అన్ని హంగులతో ఏర్పాటు చేయించిన కాలనీలకు మంత్రి కేశవ్ పేరు పెట్టాలని, ఆ దిశగా పంచాయతీలో తీర్మానం చేయాలని అధికారులపై ఒత్తిడి తేవడం సిగ్గుచేటన్నారు. టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో ఎమ్మెల్సీగా ఉన్న కేశవ్ ప్రజలకు దొంగపట్టాలు ఇచ్చి మోసగించారన్నారు. ఒక పట్టాలో 15 సర్వేనంబర్లు వేసి, వారికి స్థలం కూడా చూపలేదన్నారు.

సర్పంచులపై కక్ష సాధింపు సరికాదు..

ప్రజాస్వామ్య పద్ధతిలో గెలుపొందిన సర్పంచులపై లేనిపోని ఆరోపణలు చేస్తూ, వారిపై కక్ష సాధింపునకు దిగడం సరికాదని విశ్వ అన్నారు. అత్యధికంగా దళిత, గిరిజన, బీసీ సర్పంచుల మీద టీడీపీ నేతలు ఒత్తిడి చేస్తూ, రాజీనామా చేయించేందుకు కుట్ర పన్నుతున్నారన్నారు. ఉరవకొండలో వ్యాపారాలు, విద్యాసంస్థలు నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు, కార్యకర్తలపై కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు. టీడీపీ నాయకులు ఇలాంటి కుట్రలు, కుతంత్రాలు మానుకోకపోతే వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వీరన్న, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, ఎంపీటీసీ ఈడిగ ప్రసాద్, ఉరవకొండ సర్పంచ్ లలితమ్మ, వార్డు సభ్యులు శర్మాస్, వశికేరి మల్లి, వెంకటేష్, లాలు, ఓబుళమ్మ, అమర్నాథ్, గాదిలింగ, మూలగిరిపల్లి ఓబన్న తదితరులు పాల్గొన్నారు.

మురుగునీరు వదులుతున్నారని ఫిర్యాదు

కుందుర్పి: ప్రధాన రహదారిపై ఇరువైలాపు మురుగునీరు వదులుతున్నారని జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్‌కు కుందుర్పి ప్రజలు బుధవారం వినతిపత్రం అందించారు. సత్వరం నోటీసులు ఇచ్చి మురుగునీరు వదలకుండా చర్యలు తీసుకోవాలని మండల అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

వడ్డెర్ల సంఘం పట్టణ కమిటీ ఎన్నిక

రాయదుర్గంటౌన్: రాయదుర్గం వడ్డెర్ల సంఘం పట్టణ కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వడ్డెర్ల సంఘం పట్టణ అధ్యక్షుడిగా వడ్డే ఆంజనేయులు, ఉపాధ్యక్షుడిగా ఈరన్న, ముత్తురాశి, కార్యదర్శిగా అంజినప్ప, కోశాధికారిగా మారెన్న, కమిటీ సభ్యులుగా తిమ్మప్ప, మూలింటి నాగేష్‌ను ఎన్నుకున్నట్లు పట్టణ అధ్యక్షుడు తెలిపారు.

అధికారులను దూషించలేదు

బొమ్మనహాళ్‌: అధికారులను తాను దూషించలేదని, 40 ఏళ్లుగా చౌకడిపోను సక్రమంగా నిర్వహిస్తున్నా కావాలనే విజిలెన్స్ అధికారులు దాడులు చేశారని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, అంకంపల్లి మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి బుధవారం ప్రకటనలో అన్నారు. ఈనెల12న అంకంపల్లిలోని తన చౌకధాన్యపు దుకాణంపై విజిలెన్స్ అధికారులు దాడులు చేశారన్నాడు. తహసీల్దార్ షర్మిళను, డీటీ హుస్సేన్ పీరాను పంచనామా రిపోర్టు నకలును అడిగానన్నారు. అయితే బుధవారం కొన్ని పత్రికల్లో అధికారులను దూషించినట్లు రావడాన్ని తాను ఖండిస్తున్నానన్నాడు.

సంక్షిప్త సమాచారం

ఇప్పేరు చెరువుకు కృష్ణా జలాలు

కూడేరు: మండలంలోని ఇప్పేరు చెరువులోకి పదిరోజులుగా కృష్ణా జలాలు చేరుతున్నాయి. పి.నారాయణపురం వద్ద వెళ్లే హంద్రీనీవా సుజల స్రవంతి కాలువ నుంచి పిల్ల కాలువ ద్వారా చోళసముద్రం మీదుగా ముద్దలాపురం చెరువులోకి నీరు చేరుతోంది. దీంతో చెరువు నిండి మరువపారుతోంది. ముద్దలాపురం చెరువు నుంచి వంక కాలువ ద్వారా ఇప్పేరు చెరువులోకి నీరు చేరుతోంది.

ఘనంగా మహాలయ పండుగ

వజ్రకరూరు: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో మహాలయ పండుగను బుధవారం ఘనంగా జరుపుకున్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు

బొమ్మనహాళ్: మండల కేంద్రంలో విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రుక్మిణీ పాండురంగస్వామి ఆలయం వద్ద విశ్వకర్మ చిత్రపటాన్ని ఉంచి, విశేష పూజలు జరిపించారు. ఉదయం గణపతి పూజ, స్వస్తి పుణ్యావాహచన, కంకణధారణ, అఖండ జ్యోతి ప్రజ్వలన, బ్రహ్మమహా కలశస్థాపన, గాయత్రి విశ్వకర్మ ఆవాహన బ్రహ్మ కలశ పూజ, పంచామృతాభిషేకం చేశారు. సాయంత్రం చిత్రపటంతో ట్రాక్టర్‌లో ఊరేగించారు.

వజ్రకరూరులో స్వచ్ఛతా హీ సేవా రన్

వజ్రకరూరు: మండల కేంద్రంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. అందులో భాగంగా స్థానిక మినీ కల్యాణ మంటపం వద్ద స్వచ్ఛతా రన్ తహసీల్దార్ నయాజ్ అహమ్మద్, సర్పంచు మోనాలిసా ప్రారంభించారు. మెయిన్‌రోడ్ మీదుగా గాంధీ సర్కిల్ వరకు స్వచ్ఛతా రన్ నిర్వహించారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మావతి, పద్మా, గ్రామకార్యదర్శి శ్రీధర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో నలుగురు బదిలీ

రాయదుర్గంటౌన్: రాయదుర్గం పురపాలక సంఘంలో నలుగురు ఉద్యోగులు ఇతర మున్సిపాలిటీలకు బదిలీ అయ్యారు. వీరి స్థానంలో ఇతర మున్సిపాలిటీల నుంచి ఇక్కడికి నలుగురు బదిలీ అయినట్లు కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. రాయదుర్గం మున్సిపాలిటీలో సీనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న జయంతి పులివెందలకు, లక్ష్మీనరసింహ కళ్యాణదుర్గానికి బదిలీ కాగా, జూనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న మొహబూబ్‌బాషా, కళ్యాణదుర్గానికి, రాముడు గుత్తికి బదిలీ అయ్యారు. గుంతకల్లు, కళ్యాణదుర్గం, ధర్మవరం మున్సిపాలిటీల్లో సీనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న వెంకటరమణ, సత్యనారాయణ, హరిబాబు, కళ్యాణదుర్గంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సుశీల రాయదుర్గానికి బదిలీ అయ్యారు.

ఆటో బోల్తా - మహిళ మృతి

కళ్యాణదుర్గం రూరల్: ఆటో బోల్తాపడిన ఘటనలో ఓ మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... శెట్టూరు మండలం లక్ష్మంపల్లికి చెందిన వన్నూరస్వామి భార్య జయమ్మ (55) బుధవారం ఉదయం ములకలేడు గ్రామానికి చేరుకుని తన బంధువులతో కలసి ఆటోలో కళ్యాణదుర్గానికి బయలుదేరింది. పట్టణ శివారులోని బ్రహయ్య గుడి సమీపంలోకి చేరుకోగానే డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ఆటో బోల్తాపడింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆరుగురిని కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి తరలించారు. చికిత్సకు స్పందించక జయమ్మ మృతి చెందింది. ఘటనపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

రాయదుర్గంటౌన్: రాయదుర్గం పురపాలక సంఘంలోని కౌన్సిల్ హాల్‌లో ఈ నెల 19న ఉదయం 10:30 గంటలకు కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులు, విభాగాల వారీగా అధికారులు హాజరుకావాలని కోరారు.

డిగ్రీ పరీక్షల ఫీజు గడువు పెంచాలి

రాయదుర్గంటౌన్: డిగ్రీ మెగా సప్లిమెంటరీ ఫీజు గడువు పెంచి విద్యార్థులు ప్రొవిజనల్ సర్టిఫికెట్లు పొందే అవకాశం కల్పించాలని ఎస్కే యూనివర్సిటీ వీసీని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ బుధవారం ఓ ప్రకటనలో కోరారు. 2015 నుంచి 2019 వరకు వేలాది మంది విద్యార్థినీవిద్యార్థులు సెమిస్టర్లలో ఫెయిలైనట్లు తెలిపారు.

విధుల్లోకి నీటి సరఫరా కార్మికులు

కూడేరు: సత్యసాయి, శ్రీరామరెడ్డి తాగునీటి ప్రాజెక్ట్‌ల్లో పని చేస్తున్న కార్మికులు సమ్మె వీడి బుధవారం విధుల్లోకి చేరారు. న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని ఈ నెల 5 నుంచి తాగునీటి సరఫరా ప్రాజెక్టుల్లో పని చేస్తున్న కార్మికులు సమ్మె చేసిన విషయం విదితమే. కలెక్టర్ భరోసా మేరకు కార్మికులు విధుల్లో చేరారు.

స్వచ్ఛ తా హీ సేవ

ఉరవకొండ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో దేవదాయ, ధర్మదాయ రాష్ట్ర కమిషనర్ ఆదేశాల మేరకు స్వచ్ఛతా హీ సేవలో భాగంగా ఆలయ ఈఓ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఉత్తర, దక్షిణ ఆలయ గోపురాలు, మెట్లు శుభ్రం చేశారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

కంబదూరు: గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మిదేవీ అన్నారు. బుధవారం మండలంలోని కొత్తూరు అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త వరలక్ష్మి, ఉపాధ్యాయుడు భునేంధర్, ఆశా కార్యకర్త సుశీలమ్మ పాల్గొన్నారు.

చౌక బియ్యం స్వాధీనం

డి హీరేహాళ్ (రాయదుర్గం): డి హీరేహాళ్ మండలంలో ప్రభుత్వ చౌక బియ్యం మాఫియా రెచ్చిపోతోంది. టీడీపీ నాయకుడు ఎం.వెంకటేశులు కనుసన్నల్లో బియ్యం అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోంది. ఈ నెల 12న రాత్రి తన పొలంలో నిల్వ చేసిన 180 ప్యాకెట్ల చౌక బియ్యం పోలీసులకు పట్టుబడ్డాయి. ఈ ఘటనలో సదరు నాయకుడిపై కేసు నమోదు చేశారు. అది మరువక ముందే బుధవారం రాత్రి హిర్దేహాళ్ సమీపాన ఓ వంకలో 210 ప్యాకెట్లు సుమారు (8 టన్నులు) చౌకబియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డికి అందిన విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు చేసి, అక్రమ నిల్వలు గుర్తించి సీజ్ చేశారు.

వ్యక్తికి గాయాలు

కళ్యాణదుర్గం రూరల్: కుర్లపల్లి సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓబుళేసు అనే వ్యక్తి గాయపడ్డాడు.

21న క్రీడాపోటీలు

గుమ్మఘట్ట: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఈ నెల 21 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కింద క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ నాగమణి బుధవారం తెలిపారు.